సాక్షి తిరుపతి

శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



టీడీపీ ప్రచారంలో ఉద్యోగులు

శ్రీకాళహస్తిలో టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఇద్దరు ఉద్యోగులు పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తాయి. - 8లో



మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం

తిరుపతి జర్నలిస్టు కాలనీ వద్ద ఓ మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నించిన దుండగుడిని స్థానికులు పట్టుకున్నారు. - 8లో



భగవద్గీత శ్లోకాల పోటీలు

విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్లు గీతా ప్రచార సమితి అధ్యక్షుడు మేడసాని మోహన్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఆగమోక్తంగా దక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీగురు దక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పలు రకాల అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

15 నుంచి చేపల వేట నిషేధం

తడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాల్లో 2024వ సంవత్సరానికి సంబంధించి ఈనెల15 నుంచి జూన్ 14 వరకు తూర్పు బంగాళా ఖాతంలో మరబోట్లు, ఇతర యాంత్రిక బోట్లతో చేపల వేటను ప్రభుత్వం నిషేధించినట్లు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వి.రెడ్డినాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చేపలు, రొయ్య జాతులు సంతానోత్పత్తి (గుడ్లు పెట్టే సమయం) కాలంలో తల్లి చేపలు, తల్లి రొయ్యలను సంరక్షించే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. సముద్ర మత్స్య సంపద సురక్షిత సాధన కోసం చేపట్టిన ఈ చర్యలకు ప్రతి మత్స్యకారుడూ సహకరించాలని కోరారు. నిషేధ ఉత్తర్వులను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని అయన హెచ్చరించారు.

నేడు తొలిదశ ర్యాండమైజేషన్



హెచ్ఎం ధ్యానచంద్ర జాయింట్ కలెక్టర్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి శుక్రవారం ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. గురువారం ఆయన ఆర్వోలు, ఏఆర్ఓలు సెక్టోరల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ర్యాండమైజేషన్ ఉంటుందని చెప్పారు. ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు అవుతుందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ యాక్టివిటీస్ ద్వారా ఓటర్లలో చైతన్యం తీసుకు రావాలని తెలిపారు. నియమావళి మేరకు రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్స్‌కు పటిష్టమైన భద్రత కల్పించాలని చెప్పారు. డీఆర్వో పెంచలకిషోర్, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఒంటిమిట్టలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(అలిపిరి): ఒంటిమిట్టలో టీటీడీ అనుబంధంలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఈనెల 12వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఆలయంలో ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు..

పసుపు దంచే కార్యక్రమం రేపు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం ఉదయం పసుపు దంచే కార్యక్రమం చేపట్టనున్నారు. ఏప్రిల్ 17న ప్రారంభం కానున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా 22వ తేదీన అత్యంత వైభవంగా జరిగే శ్రీ సీతారాముల కళ్యాణంలో ఈ పసుపును వినియోగించనున్నట్లు జేఈవో వివరించారు.

ఈద్ కా దిన్..షహర్ కా షాన్



జిల్లాలో ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు అంబరాన్నంటాయి. ముస్లింలు ఈద్గాల్లో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. షీర్ కుర్మా పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలకు హిందువులు ఈద్ ముబారక్ తెలపడం.. విందులో పాల్గొనడంతో అంతటా మత సామరస్యం వెల్లివిరిసింది.

- తిరుపతి కల్చరల్

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బడుగు వర్గాల్లో చైతన్యం నింపి వారి అభ్యున్నతికి పాటు పడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పెద్దపంజాణిలో గురువారం పూలే జయంతి కార్యక్రమంలోఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి పాల్గొన్నారు. అలాగే పలమనేరులోని బీసీ ఫ్రంట్, బీసీ జిల్లా నాయకులు గోవిందస్వామి ఆధ్వర్యంలో, ఏపీ ఎన్జీఓల బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు లక్ష్మీపతి ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

- పలమనేరు/పెద్దపంజాణి

జగన్ మామయ్యా.. వేలవేల వందనాలయ్యా!





■ నా పేరు మేగనూరు మౌనిక, తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం మోమిడి గ్రామం. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నా కుమారుడు సాయి సాత్విక్‌ను చేర్పించా. మొదట్లో ప్రయివేటు పాఠశాలలో చేర్పించాలని మారాం చేశాడు. చేసేది లేక నెల్లూరులో ఓ ప్రైవేటు స్కూల్‌లో చేర్పించా. ఏటా ఫీజులు చెల్లించేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రభుత్వం అమ్మఒడి కింద నగదు అందించడంతో ఫీజు బాధలు తప్పాయి. ప్రైవేటు పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. అమ్మ ఒడి పేదలకు వరంగా మారింది.



■ నా పేరు కుడుముల అంకమ్మ. నా భర్త పేరు వెంకటేశ్వర్లు. కోట పంచాయతీ శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో ఉంటున్నాం. నిరుపేద కుటుంబం. మా ఆయన ప్రైవేట్ కంపెనీలో చిరు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు. పెద్ద పాప జ్యోషిత ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. అమ్మ ఒడి కింద ఏటా రూ.13 వేలు అందడంతో చదువులు భారం కాకుండా ప్రభుత్వం ఆదుకుంది. అరకొర ఆదాయంతో బతుకుతున్న మాలాంటి వాళ్లకు అమ్మఒడి అండగా నిలిస్తోంది. జగనన్నకు రుణపడి ఉంటాం.



■ అమ్మతో బడికి వెళుతున్న ఈ చిన్నారి వాకాడు దళితవాడకు చెందిన బి.హేబాగ్రేసీ తల్లి భాగ్య. నిరుపేద కుటుంబం. రెక్కాకడితేగాని డొక్క నిండని పరిస్థితి. తమ లాగా బిడ్డకూడా ఎక్కడ చదువుకు దూరమవుతుందోనని భాగ్య మదన పడేది. అమ్మఒడి పథకంతో బిడ్డను చదివించేందుకు 2020లో కాలనీలోనే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతోంది. తమ బిడ్డ ఇంట్లో ఇంగ్లిషులో మాట్లాడుతుంటే భాగ్య సంబరపడిపోతోంది. ఇదంతా జగనన్న దయ అని ఆనందం వ్యక్తం చేస్తోంది.

- 'అమ్మఒడి'తో అక్కచెల్లెమ్మలకు భరోసా
- ఫీజుల భారానికి స్వస్తి
- ఉన్నత చదువులకు నాంది
- ఏటా బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ఇది కదా.. అభివృద్ధి

పేదరికంలో ఉన్న వారు చదివించేందుకు కూడా కష్ట తరంగా మారిన రోజులు నుంచి నేడు సగర్వంగా ప్రభుత్వ బడుల్లో విద్యాభ్యాసం చేసే స్థితికి వచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువుకు పేదరికం అడ్డుకాకూడదని జగనన్న అమ్మఒడి పథకంతో తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ప్రభుత్వ బడుల్లో నాడు-నేడు కింద వసతులు కల్పించడంతో పాటు ప్రయివేటు పాఠశాలల్లో చదువుకున్న వారికి కూడా ఫీజులు చెల్లించేలా తల్లుల బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం అమ్మఒడి కింద ఏడాదికి ఒకసారి రూ.15 వేలను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో బడుల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగింది. పేద,మధ్య తరగతి వారు తమ బిడ్డలకు ప్రభుత్వం మంచి భవిష్యత్తును కల్పిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిల్లకూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ బడుల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. నాడు-నేడు కింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి రూపు రేఖలు మార్చేశారు. మన ఊరిలో కళ్ల ముందే బడి మారిందని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ బడికే పంపడం మొదలు పెట్టారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థు సంఖ్య పెరగడంతో ప్రభుత్వం మరొక అడుగు ముందుకు వేసింది. చదువుకునే చిన్నారి ఇంటిలో ఒకరికి అమ్మఒడి కింద నగదును తల్లుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని ప్రకటించింది. పాఠశాల ప్రారంభానికి ముందే తల్లుల ఖాతాలు నగదు జమ చేస్తోంది. దీంతోపాటు విద్యా కానుక కింద విద్యార్థికి అవసరమైన పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం, బూట్లు బడి ప్రారంభ రోజునే అందిస్తోంది. బడికి వచ్చే చిన్నారికి రోజుకో మెనూ చొప్పున కోడిగుడ్డు, చిక్కీలతో కూడిన పౌష్టికాహారం అందజేస్తోంది. దీంతో చిన్నారులకు బడికి వెళ్లే సమయంలో ఇచ్చే ప్యాకెట్ మనీ కూడా తల్లిదండ్రులకు మిగిలిపోతుంది. చిన్నారికి ఏడాదిలో చదువుకు అవసరమైన అన్ని ఖర్చులకు అమ్మఒడి అండగా నిలుస్తోందని తల్లులు అంటున్నారు.

మండలం	స్కూళ్లు	లబ్ధి పొందిన తల్లులు	మొత్తం (రూ.లు) కోట్లలో
గూడూరు	89	35,523	53.01
చిల్లకూరు	72	18,209	27.32
కోట	77	17,794	26.69
వాకాడు	72	12,611	18.91
చిట్టమూరు	83	13,918	20.61

పేదరికాన్ని జయించేలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక డ్రాపౌట్స్ తగ్గాయి. గత ప్రభుత్వంలో ఆర్థిక ఇబ్బందులతో కొందరు చదువుకు దూరమై బడి బయట పిల్లలు ఎక్కువగా కనిపించే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థికభారం తగ్గించేందుకు అమ్మ ఒడిని ప్రవేశపెట్టి తల్లుల ఖాతాలో ఏటా రూ.13 వేలు జమ చేస్తోంది. దీంతో బడి బయట పిల్లలు సంఖ్య తగ్గింది. విద్యా కానుక పేరుతో విద్యా సామగ్రి, యూనిఫాం, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంటు ద్వారా అండగా నిలుస్తుండడంతో బడుగు, బలహీన వర్గాల వారు పేదరికంపై విజయం సాధిస్తున్నారు. జగనన్నకు రుణపడి ఉంటామని ఆనందంగా చెబుతున్నారు.



పాఠశాలలో రంగులతో వేసిన బొమ్మల వద్ద చిన్నారుల కేరింత

అమ్మకు తొలగిన ఇబ్బందులు



అమ్మఒడి కింద నగదును అమ్మల ఖాతాలో జమ కావడంతో చదువుల ఆర్థిక ఇబ్బందులు తొలగాయి. మూడేళ్లుగా మా అమ్మ బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉండడంతో బాగా చదువుకునేందుకు అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయడంతో పేదల చదువుకు భరోసా ఏర్పడింది. – సీహెచ్ భాగ్యలక్ష్మి, విద్యార్థి, వాకాడు

అవసరాలు తీరుస్తోంది



అమ్మఒడి నాలుగేళ్లుగా అందుకుంటున్నా. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 8వ తరగతి, ఇంకొకరు నాలుగవ తరగతి. ఒకరికి అమ్మ ఒడి వస్తోంది. దీంతో ఇద్దరు బిడ్డల అవసరాలను తీర్చేకునేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అమ్మఒడి ఆదుకుంటుంది. ఇద్దరు పిల్లలకు బడిలోనే విద్యా కానుక అందుతోంది. తల్లిదండ్రులకు అమ్మఒడి ఆర్థిక ధైర్యాన్ని ఇస్తోంది. – చిట్టిజ్యోతి, తల్లి, సాదుపేట, గూడూరు

అమ్మ ఒడి ఆదుకుంటుంది



అమ్మ ఒడి నగదు ఆర్థికంగా ఆదుకుంది. ప్రభుత్వం నా లాంటి పేద విద్యార్థులకు అండగా నిలుస్తోంది. నాడు-నేడు కింద పాఠశాలలను బాగు చేశారు. విద్యా కానుక కింద మాకు కావాల్సిన అన్నీ సమకూర్చారు. అమ్మఒడి నగదు తల్లుల ఖాతాలో జమ చేయడం ద్వారా ప్రతి పేద విద్యార్థి చదువునే అవకాశం కలుగుతోంది.

జి.హనీ, 9వ తరగతి, చిల్లకూరు

ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నాం..



ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుంది. పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. నా ఇద్దరి పిల్లలను కోట జెడ్పీ హైస్కూల్‌లోనే చదివిస్తున్నా. 9వ తరగతి చదువుతున్న దినేష్‌కు అమ్మఒడి కింద ఏటా రూ.13వేలు అందుతోంది. పేద పిల్లల చదువుకు అమ్మఒడి వరంలా మారింది. జగనన్న గోరుముద్ద కింద పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారు.

అపర్ణ,విద్యార్థి తల్లి, కోట

సంక్షేమం, అభివృద్ధే జగనన్న అజెండా

- ప్రజలను నమ్మించి మోసం చేయడమే బాబు ఎజెండా
- 2, 4 డివిజన్ల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే అజెండాగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ప్రజలకు మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేయడమే చంద్రబాబు నైజం, ఎజెండా అని ధ్వజమెత్తారు. తిరుపతిలోని 2వ డివిజన్‌లో గురువారం కార్పొరేటర్లు ఉమాఅజయ్, అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భూమనకు ఆయా డివిజన్లలో అపూర్వస్వాగతం లభించింది. స్థానికులు మాట్లాడుతూ గత 40 ఏళ్లలో ఎవ్వరికీ సాధ్యంకాని విధంగా కేవలం రెండేళ్లలో తిరుపతిని ఇంతగా అభివృద్ధి చేసిన ఘనత డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఆయనను అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని ప్రతిన బూనారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపేదవాడికి మరింతగా సంక్షేమం ఎలా అందించాలన్న తపన జగనన్నదైతే, ఓట్లు, సీట్ల కోసం ప్రజలకు ఎలాంటి మాయమాటలు చెప్పాలి, ఎలా నమ్మించి మోసగించాలని చూసే ప్రజాద్రోహి చంద్రబాబు అని మండిపడ్డారు.



ఆటోనగర్‌లో ఎమ్మెల్యే భూమనకు హారతులతో స్వాగతం

కరోనా కంటే టీడీపీ కూటమి డేంజర్



పథకాల లబ్ధిని వివరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

బాలాయపల్లి (డక్కిలి): కరోనా కంటే టీడీపీ, జనసేన కూటమి డేంజరని, ప్రజలు వారి మాటలు నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని సిద్దాగుంట, తాళ్లపల్లి, పాపిరెడ్డిపల్లి, ఊట్లపల్లి, నిడిగల్లు, గాజులపల్లి, కాలకంద, అరిగేపల్లి, కాట్రగుంట, తిక్కవరం, కయ్యూరు గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఆయనకు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన సాగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలంతా ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను జగనన్న ఐదేళ్ల పాలనలో అందించారని పేర్కొన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా రాష్ట్రాన్ని పట్టించుకోకుండా ఈ సారి అధికారంలోకి వస్తే చేస్తామనడం హాస్యాస్పందంగా ఉందన్నారు. వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం తనను ప్రజలు ఒక్కసారి ఆదరించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కార్తీక్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జీ బాబి చౌదరి, మహిళా అధికార ప్రతినిధి రావి దేవికా చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ తులసి, నాయకులు ఎస్.సురేష్, రామయ్య, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు కూలీ మృతి

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీ ముసలరాజు కండ్రిగ గ్రామానికి చెందిన రైతు కూలీ ఎం.రవి(50) వడదెబ్బకు మృతి చెందాడు. గురువారం గ్రామ సమీపంలో పొలం పనులు చేస్తున్నాడు. 12గంటల ప్రాంతంలో ఎండ వేడిమికి తట్టుకోలేక చెట్టునీడన కూర్చొని సొమసిల్లిపడి పోయాడు. సమీపంలోని రైతు కూలీలు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు సత్యవేడు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వచ్చారు. వైద్యాధికారి పరీక్షించేలోపే మృతి చెందాడు. వడ దెబ్బ కారణంగా మృతి చెందినట్టు వైద్యాధికారి చంద్రన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ డి.నాగమ్మ కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది

తిరుపతి క్రైమ్: నగరంలో ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు.. గురువారం మారుతీనగర్ కు చెందిన ఎస్ఎస్ఎస్ వి కృష్ణమూర్తి హర్యానా నుంచి మద్యం తీసుకువచ్చి అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. సీఐ సిబ్బందితో దాడి చేసి, 22.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

కోట: చికెన్ స్టాల్‌లో పనిచేస్తున్న యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన గురువారం విద్యానగర్‌లో చోటుచేసుకుంది.స్థానికుల కథనం మేరకు.. వాకాడు మండలం సిద్దిగుంటపాళెంకు చెందిన ఉమర్‌ఫరూక్(22) విద్యానగర్‌లోని బంధువులకు చెందిన చికెన్‌స్టాల్‌లో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. వేడినీళ్ల బ్రాయిలర్ మిషన్ వద్ద పనిచేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని సిద్దిగుంటపాళెంకు తరలించారు. రంజాన్ రోజు యువకుడి మృతి కుటుంబంలో విషాదం నింపింది. మృతుడి తండ్రి ఇస్మాయిల్ కొంతకాలం కిందట రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తమకెలాంటి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగబాబు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

– బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం



నిందుతుడు, స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న పోలీసులు

తిరుపతి రూరల్: పలు చోరీ కేసుల్లో నిందితుడిని తిరుపతి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ తమీమ్ అహ్మద్ గురువారం నిందితుడి మీడియా ముందు ప్రవేశపెట్టి, స్వాధీనం చేసుకున్న ఆభరణాలను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జీవకోన నవజీవన్ కాలనీకి చెందిన వి.మణి కొంత కాలంగా ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. గురువారం ఉదయం చాకచక్యంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని సుమారు రూ.2.20 లక్షల విలువైన 109 గ్రాముల బంగారు, 109 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందుతుడిని రిమాండ్‌కు తరలించారు.

టీడీపీ, జనసేనకు బైబై..ఫ్యాన్‌కు జైజై





ఆటోనగర్‌లో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు నవీన్, పాండుకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే భూమన



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతిలో టీడీపీ, జనసేన పార్టీలకు యువత గుడ్ బై చెబుతున్నారు. యువ నాయకుడు భూమన అభినయ్‌రెడ్డి చేసిన అభివృద్ధికి ఆకర్షితులమైయ్యామని, తిరుపతి మరింత అభివృద్ధికి వెంటే నడుస్తామని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నవీన్, పాండుతో పాటు భారీగా యువత గురువారం తిరుపతి ఆటోనగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ ఉమాఅజయ్, అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీటీడీ చైర్మన్ తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజు టీడీపీ, జనసేన పార్టీల నుంచి యువత వైఎస్సార్‌సీపీలో చేరుతుండడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తిరుపతిలో అభినయ్ అన్న చేసిన అభివృద్ధి చరిత్రలో నిలిచిపోయేలా ఉందని, ఇంక ఏ నాయకుడు వచ్చినా ఇంతకన్నా అభివృద్ధి చేయగలరా? అని ప్రశ్నించారు. అభినయ్ అన్న వెంట ఉండి సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు తాము సిద్ధం అని యువత ముక్తకంఠంతో స్పష్టం చేసింది.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కుటుంబాలు

తిరుపతి రూరల్: రామచంద్రాపురం మండలంలో వైఎస్సార్ సీపీకి రోజు రోజుకు బలం మరింత పెరుగుతోంది. మండలంలోని కేకే పురం పంచాయతీ పరిధిలోని తొమ్మిది కుటుంబాలు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే చెవిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఇందుకు తుమ్మలగుంట ఎమ్మెల్యే నివాసం వేదికైంది. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కేకే పురం పంచాయతీ కుటుంబాలకు ఇరువురు అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున అందించే సంక్షేమ ఫలాలు మాత్రమే కాకుండా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తి గతంగా ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి ప్రజా సేవకై సంకల్పించారని గుర్తు చేశారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేస్తానని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన కుటుంబాల సభ్యుల్లో దేశయ్య, సుబ్రహ్మణ్యం, గంగయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, లక్ష్మీదేవి, శ్యామల, దాక్షాయిణి, సుభాషిణి, చలపతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు జ్యోతి, పార్టీ నాయకులు జానకి రాముడు, పూర్ణ, రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.







శ్రీకాళహస్తి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ గురుమూర్తి, రేణిగుంట: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

బీజేపీ, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి ..

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లెకు చెందిన 20 మంది బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు సర్పంచ్ బొర్రా నారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం మండలంలోని జంగాలపల్లెలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం జరిగింది. గ్రామంలోని బీజేపీకి చెందిన ఏకాంబరం, నరసింహులు, టీడీపీకి చెందిన నైనారు వాసుదేవయ్య, వెంకటరత్నం, సుబ్బమ్మ, గీత, సుధ తదితర 20 మంది ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీలో చేరగా, ఎంపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు చెప్పారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కుటుంబాలు

రేణిగుంట: రేణిగుంట మండలం విప్పమానుపట్టెడ గ్రామానికి చెందిన 50 తెలుగుదేశం పార్టీ కుటుంబాలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరాయి. శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రుక్మిణమ్మ, లక్ష్మి, తలకం, నీరజమ్మ, ఉష, లక్ష్మి, కె.మునెమ్మ, ఆర్.మునెమ్మ, వి.కవిత, తామరమ్మ, లత, చిట్టెమ్మ, సౌభాగ్య, విజయ, స్వప్న, అనురాధ, మంజుల, సుభద్రమ్మ, పార్వతమ్మ, లక్ష్మమ్మ, లక్ష్మీదే వి, ఎం.సుమతి, బి.రేణుకమ్మ, బి.వాసవి, టి.జయమ్మ, రాజేశ్వరమ్మ, దుర్గ, టి.మునెమ్మ, పి.విమల, శ్రీరామ సిద్ధార్థ్‌రెడ్డి, వాసవి, నిరోష తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ అభివృద్ధితోపాటు సొంత నిధులతో చేస్తూ పేదలను ఆదుకుంటుండడం నచ్చి వైఎస్సార్ సీపీలో చేరామన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నాయకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి టీడీపీ సీనియర్ నాయకులు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. నాయకులు పూలా ఆనంద్, శ్రీనివాసులు, చిరంజీవులు, వారి అనుచరులు గురవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆయన కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో గతంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధిని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై వైస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు ఉన్నం వాసునాయుడు, లోకేష్‌యాదవ్ పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో రాజేష్

నారాయణవనం: మండలంలోని కసిమ్మిట్ట పంచాయతీ ఇప్పన్‌తాంగాళ్ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గోపాల్, మునివేలు, ధ్యానివేలు, గోవిందరాజులు, కుమార్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం తుంబూరు ప్రచారంలో సత్యవేడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ వీరికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ అనిశ్చితి నెలకొన్న టీడీపీలో ఇమడలేక పోయామని వారు పేర్కొన్నారు. ఐదేళ్ల జగనన్న పాలనలో అమలైన పలు సంక్షేమ ఫలాలను తమ కుటుంబాలు లబ్ధిపొందాయని, జగనన్న పారదర్శక పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు పేర్కొన్నారు. రాజేష్ మాట్లాడుతూ సంక్షేమ పాలన మరో ఐదేళ్లు కొనసాగాలంటే మరో మారు జగనన్నను మళ్లీ సీఎంగా చేసేందుకు ఐక్యంగా పనిచేద్దామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్ రెడ్డి, కసిమ్మిట్ట పంచాయతీ నాయకులు అయ్యప్ప, ఆరుముగం, ఇప్పన్‌తాంగాళ్ యువకులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : శ్రీకాళహస్తి మండలంలోని వెలంపాడు గ్రామంలో తపాలాశాఖ బీపీఎం కిలారి నరసింహప్రసాద్, తొట్టంబేడు మండల పాయ్య గ్రామ బీపీఎం ఎంఎస్ ప్రసాద్‌నాయుడు నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం వివాదాస్పదమైంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి కుటుంబానికి సన్నిహితులుగా మెలగడంతో పాటు వారు, వారి కుటుంబసభ్యులు నిర్వహించే ఎన్నికల ప్రచారంలో జోరుగా పాల్గొంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి నిర్వహించే ప్రచారంలో కిలారి నరసింహప్రసాద్, బొజ్జల సుధీర్‌రెడ్డి నిర్వహించే ప్రచారంలో ఉన్నం ప్రసాద్‌నాయుడు సమయం దొరికనపుడల్లా పాల్గొంటూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. వీరికి ఎన్నికల నిబంధనలు వర్తించవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



సుధీర్‌రెడ్డి ప్రచారంలో ఉన్నం ప్రసాద్‌నాయుడు

మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం



పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి రూరల్: మండలంలో గాంధీపురం పంచాయతీ బాలాజీడెయిరీ సమీపంలోని జర్నలిస్టు కాలనీ వద్ద ఓ మహిళ మెడలో గొలుసు చోరీకి ఓ దుండగుడు యత్నించాడు. అయితే ఆమె ఎంతో ధైర్యంతో ఆగంతకుడిని ఎదుర్కోవడంతో దొరికిపోయాడు. జర్నలిస్టు కాలనీలో నివాసం ఉంటున్న యెండ్లూరి లత బాలాజీ డెయిరీ పక్కనే ఉన్న తన ఇంటి వద్దకు వెళ్లడానికి బెంగళూరు జాతీయ రహదారి పైనుంచి కిందకు దిగుతున్నారు. అక్కడే చీకటిలో పొంచి ఉన్న ఓ దుండగుడు ఆమె మెడలో గొలుసు లాక్కోవడానికి ప్రయత్నించాడు. అయితే ఆమె ధైర్యంగా అతనిని తోసేసింది. అతను మరోసారి కూడా లాక్కోవడానికి విఫలయత్నం చేశాడు. ఆమె మరోసారి కూడా అతన్ని కిందకు తోసేసి, కేకలు వేసింది. దీంతో ఇంటిలో ఉన్న ఆమె కుమారుడు, చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకున్నారు. ఆ దుండగుడిని పట్టుకున్నారు. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొత్తగా రూపుదిద్దుకుంటున్న జర్నలిస్టు కాలనీ లో సరైన రోడ్డు, వీధిలైట్లు లేకపోవడంతో ఇ లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా యని బాధితులు తెలిపారు. జర్నలిస్టు కాలనీ లో వసతులు కల్పించడంతోపాటు రాత్రి వేళల్లో పోలీసు పహారా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు

తిరుపతి కల్చరల్: భావిభారత పౌరులైన విద్యార్థుల్లో మానవీయత, నైతికతత, ఆధ్యాత్మికల విలువలను, ఉన్నత వారసత్వ సంపదను పెంపొందించాలనే సంకల్పంతో జాతీయ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, భావాల రాత పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు డాక్టర్ మేడసాని మోహన్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన సమితి ప్రతినిధులతో కలిసి భగవద్గీత వంద శ్లోకాలు, భావాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కంచి శంకర మఠం పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీస్వామి ఆశీస్సులతో కృష్ణతేజ విద్యా సంస్థల చదలవాడ కృష్ణమూర్తి సహకారంతో సెప్టెంబర్‌లో కృష్ణతేజ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ పోటీ పరీక్షలు ఉంటాయని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.18,000 ,రూ.15,003, రూ.12,006 అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే 15 మంది విద్యార్థులకు రూ.2016 చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. వివరాలకు 9949305107ను సంప్రదించాలని కోరారు. జాతీయ గీతా ప్రచార సమితి ఫౌండర్ రాజబోయిన వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర చౌదరి, ప్రధాన కార్యదర్శి పి.ధర్మాచారి, పి.బాబు రాజేంద్రప్రసాద్, జయచంద్రనాయుడు, వై.అంకమనాయుడు, పి.జయరాజు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులపై కుట్రపూరిత చర్యలు



మురళి

తిరుపతి సిటీ : ఎస్వీయూలో వైఎస్సాఆర్ సీపీకి అనుకూలంగా ఉద్యోగులు ప్రచారం చేస్తున్నారని కుట్ర పూరితంగా కొందరు తెలుగుదేశం పార్టీ అనుచరులు వ్యవహరించడం దారుణమని వైఎస్సాఆర్ టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.మురళీరెడ్డి ఆరోపించారు. ఎస్వీయూలో తాత్కాలిక ఉద్యో గుల సస్పెన్షన్‌పై ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల కిందట ఎస్వీయూ ఉద్యోగుల క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే ప్రచార నిమిత్తం రావడంతో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశామని తెలిపారు. దీనిని ఆసరాగా చేసుకుని తెలుగుదేశం పార్టీ అనుచరులు కుట్రలు పన్ని తనతో పాటు మరో ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు ప్రచారంలో పాల్గొన్నారంటూ నిరాధారమైన వీడియోలను, ఫొటోలను చిత్రీకరించారని ఆరోపించారు. ఉద్యోగులపై బురదజల్లడమే వృత్తిగా పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులైన లైబ్రరీ ఇన్‌చార్జ్ సురేంద్రబాబు నాయుడు, టైమ్ స్కేల్ ఉద్యోగులు మధుసూదన్‌నాయుడు, ప్రసా ద్‌రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరమణ కలసి ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారని దుయ్యపట్టారు. వీరికి సన్నిహితంగా మసలుతున్న వర్సిటీకి సంబంధంలేని బయట వ్యక్తి, తెలుగుదేశం పార్టీ నాయకుడు సీఎస్ నాయుడు ప్రో త్సాహంతో ఉద్యోగులపై కుట్రలు పన్ను తున్నారని తెలిపారు. తాము తాత్కాలికంగా సస్పెండ్‌కు గురైనా, విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయని, బాధ్యత గల ఉద్యోగుల సంఘ నాయకులుగా ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను తాము శిరసావహిస్తామని ఆయన తెలిపారు.

రంజాన్ ప్రార్థనల్లో టీడీపీ కూటమి ప్రచారం

- తిరుపతి ఈద్గాలో టీడీపీ, జనసేన రగడ
- అడ్డుకున్న మతపెద్దలు



ఆరణి శ్రీనివాసులు ప్రసంగాన్ని అడ్డుకుంటున్న ముస్లిం పెద్దలు

తిరుపతి(అలిపిరి): రంజాన్ సందర్భంగా తిరుపతి ఈద్గా మైదానంలో జరిగిన ముస్లింల ప్రార్థనల్లో గురువారం 'టీడీపీ–జనసేన–బీజేపీ' నా యకుల ప్రచారంతో దుమా రం చెలరేగింది. ప్రార్థనలు జరుగుతున్న సమయంలో తిరుపతి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులతో పాటు టీడీపీ, బీజేపీ నాయకులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చారు. అప్పటికే ముస్లింలు ప్రార్థనల్లో ఎలాంటి రాజకీయాలు మాట్లాడరాదన్న నిర్ణయం మేరకు అదే నాయకులకు సూచించారు. అయితే ఆరణి శ్రీనివాసులు మైక్ చేతపట్టుకుని శుభాకాంక్షలు తెలపడంతో పాటు తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు సహకరించాలని కోరడంతో కొందరు ముస్లిం పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు మాట్లాడకూడదని సూచించినా ఓట్లు వేయాలని అభ్యర్థించడం ఏమిటని ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై మరొకరు చేయిచేసుకున్నారు. దీంతో నెమ్మదిగా ఆరణి శ్రీనివాసులుతో పాటు నాయకులు జారుకోవడంతో ముస్లిం పెద్దలు సర్ది చెప్పడంతో వ్యవహారం సద్దుమణిగింది. దీంతో నెమ్మదిగా నాయకులు జారుకోవడంతో పాటు పెద్దల సూచనలతో వ్యవహారం సద్దుమణిగింది.

ఈద్గాలో సుధీర్ రాజకీయ ప్రసంగం

శ్రీకాళహస్తి: రంజాన్ పురస్కరించుకుని ముస్లింలు ఈద్గాలో ప్రార్థనలు నిర్వహించారు. అలాంటి చోట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి రాజకీయ ప్రసంగం చేయడం దుమారం రేపింది. గతంలో కూడా గుడ్‌ఫ్రైడే రోజున చర్చికి వెళ్లి రాజకీయ ప్రసంగం చేశారు. ఈద్గాల్లో, చర్చిల్లో రాజకీయ ప్రసంగం చేయకూడదన్న నిబంధనను అతిక్రమించారు. ఈద్గా వద్ద స్థలం ఇచ్చింది తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అని డప్పు కొట్టారు. తాను ఏమి చేశాడో చెప్పుకోలేని సుధీర్‌రెడ్డి, తండ్రలు, తాతల పేర్లు చెప్పుకుని నిబంధనలకు విరుద్ధంగా రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందని పలువురు మాట్లాడుకోవడం కనిపించింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఐదేళ్లుగా ముస్లింలకు మేనమామ సొంగ్యం అందిస్తున్నారు. ఎన్నికల నిబంధనల కారణంగా ఆ విషయం ఎక్కడా ప్రస్తావించడం లేదని ప్రజలు అంటున్నారు. సుధీర్ నిబంధనల ఉల్లంఘనలపై ఎన్నికల అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,570 మంది స్వామివారిని దర్శించుకోగా, 24,446 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సుబ్రమణ్యస్వామి సేవలో మంత్రులు



సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద మంత్రులు పెద్దిరెడ్డి, ఆర్‌కే రోజా

నగరి: తిరుత్తణి సుబ్రమణ్యస్వామిని పంగుణి కృత్తికను పురస్కరించుకుని రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి విచ్చేసిన వారు ఆలయ ప్రదక్షిణ చేసి సుబ్రమణ్యస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనల్లో పాల్గొని దర్శించుకున్నారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. తమది తండ్రీ, కూతుళ్ల బంధమని, తమ మధ్య ఆప్యాయతానురాగాలు ఎప్పటికీ తరగవన్నారు. ఆయన మిథునన్నపై ఎంత ఆప్యాయతను చూపుతారో తన పట్ల కూడా అంతే ఆప్యాయతను చూపుతారని మంత్రి ఆర్కేరోజా ఈ సందర్భంగా తెలిపారు. ఆయన ఆశీస్సులు తనకు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు.